కవితా కౌముది

## ఇంకెంత ఇష్టమో ఈ నిజానిది ? చందలూరి నారాయణరావు

చీకటి బాగా కాసి
మనసును పులిమినప్పుడు

పాత కలే
చిరిగిన గుడ్డల్లో మాసిన ముఖంతో
కోరిక తలుపు కొడుతూనే ఉంది.

రెండు క్షణాల వయసులోనే ఇష్టం
ప్రేమగా పరవశమై
తన నీడనే తనే తొడుక్కుని

తలలో కంటికెదురుగా లోతు ప్రశ్నలతో
యుద్ధనౌకలో పొలిమేర దాకా సాగే
కలవరింత వేడుకలో పరిమళిస్తూ

దిక్కు తెలియకుండానే
దారితో పనిలేకుండా
ఆశ సువాసనతో గెంతులేసుకుంటూ
గాలితో కలసి లోపల చేసే ప్రయాణంలో

ఇంకెంత నిజమో ఈ ఇష్టానిది?
ఇంకెంత దగ్గరో ఆ గమ్యానిది?

★★★

## ఆత్మావలోకనం
### బాలాజీ పోతుల

లోకమంతా వెతికాను - లోపాల బొరియల్ని
నన్ను మించిన తుచ్ఛ బుర్రేదీ కాన రాలేదు!

లోకపు కీర్తి కోసం వెంపర్లాడాను
అడ్డదార్లు నా స్వార్థానికి తొక్కాను
నా కిందోడు పై మెట్టెక్కితే - కుళ్ళి చచ్చాను
లోకపు నీతులన్నీ సిగ్గుదప్పి వల్లించాను

నాలో వెలుగొచ్చాక -
నా దిగంబరత్వాన్ని కళ్ళార కని,
కణకణ మండే అగ్నికి ఆహుతయ్యాను

ఇప్పుడు నేను - నేను కాదు
అసలు నేనంటూ లేనేలేను
మరణం లేని మనిషినయ్యాను
దహనం అయ్యాక బూడిదయ్యాను

★★★



## గుడ్డిబావి
### భమిడిపాటి వెంకటేశ్వరరావు

జీవన వ్యాపారంలో మునిగిపోయిన లోకానికి

పిచ్చి మొక్కల్లా చెదిరిన జట్టుతో
ఎండిపోయిన గుడ్డి బావొకటి
ఎదురయ్యింది..

బయటా లోపలా అంతా చీకటి...

మాటతో చెలిమి చేసి
మనసు చేదతో తోడుకుంటే
అట్టడుగున దొరికాయి
నాలుగు కన్నీటి చుక్కలు...

చూపు లేనంత మాత్రాన
అనుభూతులు యింకిపోవు...

కరుణ కలిగుండి లోతుల్ని
స్పృశించగలిగితేనే

బావి గురించి అర్థమయ్యేది..!
బతుకు వేదన కాస్తంతయినా బోధ పడేది..!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎంత యద్భుతమైనదీ సృష్టి యెల్ల
సమతిశోభాన్వితమ్మీ విశాలజగతి
యుగయుగమ్ములిచ్చట వెలుగొంది కూడ
తరుగెరుంగని నిత్యసౌందర్యమిద్ది

ఉదయసంధ్యలు రవిచంద్రులుడువుతతులు
చెట్లు చేమలు వనులు పచ్చికబయళ్ళు
మలలు మలలపై తేలెడు మబ్బుతెరలు
సర్వమానందదాయకముర్వియందు

కష్టసుఖముల మిళితమ్ము గతమదెల్ల
వచ్చు కాలము వానినే తెచ్చు మరల
సుఖమునందలి హ్లాదమ్ము సువిదితమ్ము
కష్టమందున పరితుష్టి కనగనగును

ఎల్లవేళలయందుననెచటనున్న
సకలసుఖములనున్న కష్టములనున్న
మనసు నిశ్చలస్థితియందు మగ్నమైన
అన్ని ఘడియలనానందమవగతమ్ము

కష్టములనెట్లొ తొలగింపగలిగినపుడు
సతము చింతింపగానవసరము లేదు
సంకటమ్ముల బాపనసాధ్యమైన
తల్లడిల చింతలో ఫలితమ్ము లేదు

COMMENTS